క్లుప్తంగా

రూ.5 లక్షలతో డ్రైనేజీ నిర్మాణం



పొదలకూరు : మండలంలోని ఊసపల్లిలో డ్రైనేజీ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వావింటపర్తి సచివాలయం పరిధిలోని ఊసపల్లిలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పర్యటించారు. ఆ సమయంలో గ్రామస్తులు డ్రైనేజీ నిర్మించాలని కోరగా మంత్రి వెంటనే స్పందించి రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో నుడా ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో డ్రైనేజీ పనులు చేపడుతున్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



ముత్తుకూరు: సెంబ్‌కార్ప్, ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ముసునూరువారిపాళెం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. సర్పంచ్ ముసునూరు జనార్దన్‌రెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం 150 మందికి వైద్యులు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుబహాన్‌బాషా, అశోక్‌గౌడ్, షమీమ్, నాగూర్, తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): నగరంలోని హరనాథపురం, గుర్రాలమడుగు ప్రాంతాల్లో సింగిల్ నంబర్లాటపై బాలాజీనగర్ పోలీసులు దాడులు చేశారు. సింగిల్ నంబర్లాడుతున్న యలమవారిదిన్నెకు చెందిన సుమన్, వెలగచెట్టు సంఘానికి చెందిన చిరంజీవి, గుర్రాలమడుగు సంఘానికి చెందిన వెంకటేష్, ముత్తుకూరు గేట్ సెంటర్‌కు చెందిన సందీప్‌ను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.24 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ రాములునాయక్ మాట్లాడారు. తమ ప్రాంతాల్లో నేరాలు జరుగుతున్నాయని గుర్తిస్తే డయల్ 100 లేదా 94407 96311, 94407 00094 నంబర్లకు సమాచారమివ్వాలని కోరారు.

ఈఎస్‌ఆర్‌ఎంలో కలెక్టర్ తనిఖీ



నెల్లూరు (టౌన్): మూలాపేటలోని ఈఎస్‌ఆర్‌ఎం హైస్కూల్‌ను కలెక్టర్ హరినారాయణన్ బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల వివరాలను ఆరాతీశారు. చైల్డ్ ఇన్ఫో మేరకు విద్యా కానుక, అమ్మ ఒడి, తదితర పథకాలను అందించారానే అంశాన్ని తెలుసుకున్నారు. సీఆర్ యాప్ ఆధారంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సర్వే చేపట్టి బడి - ఈడు పిల్లలు పాఠశాలల్లో ఉండేలా చూడాలని చెప్పారు. అనంతరం అరవిందనగర్‌లోని నారాయణ జూనియర్ కళాశాలను పరిశీలించారు. కమిషనర్ వికాస్ మర్మత్, డీఈఓ గంగాభవానీ, ఆర్‌ఐఓ శ్రీనివాసులు, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, ఎంఈఓ తిరుపాల్, ప్రధానోపాధ్యాయుడు శివరామ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఐపై వర్క్‌షాపు

నెల్లూరు(బారకాసు): ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్ర ధనుష్ (ఐఎంఐ) 5.0 కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య ఆదేశించారు. సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో ఐఎంఐపై బుధవారం నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. గర్భిణులు, ఐదేళ్లలోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో ఇచ్చి మీజెల్స్, రూబెల్లా వ్యాధులను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. గుర్తించిన వారికి మూడు విడతల్లో నిర్దేశించిన తేదీల్లో వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని చెప్పారు. ప్రతి నెలా 14న నిర్వహించనున్న ఆరోగ్య మేళాను విజయవంతం చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఐఎంఐపై సర్వైలెన్స్ మెడికల్ ఆఫీసర్ భవాని శిక్షణ ఇచ్చారు. డీఎల్‌ఏటీఓ డాక్టర్ బ్రిజిత, ఎఫ్‌పీసీ నోడల్ అధికారి డాక్టర్ దయాకర్, డెమో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

• ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీరామరక్ష, ఎప్పుడు ఎన్నికలు జరిగిన జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం పీఠం అధిరోహించడం తథ్యమని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొమరికలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోనే అదర్శంగా నిలుస్తున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. గతంలో సంక్షేమ పథకాల కోసం అధికారులు,నాయకులు, జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. ప్రస్తుతం వలంటీర్ల ద్వారా అర్హులందరికీ ఇంటి ముంగిటే సంక్షేమ పథకాలు అందజేస్తుండడంతో ఏ గడపకు వెళ్లిన అప్యాయత, అనురాగాల నడుమ కుటుంబ సభ్యుడి తరహాలో ఆదరిస్తున్నారన్నారు. తొలుత ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు.

చిన్నారులకు చేయూత

తండ్రిని కోల్పోయిన, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న కొమరికకు చెందిన ముగ్గురు చిన్నారులకు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేయూతనందించారు. తన తండ్రి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ముగ్గురు చిన్నారులకు రూ.20వేల చొప్పున మొత్తం రూ.60వేలు బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయించి బాండ్లు అందజేశారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

కొమరికలో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన ఆర్‌ఓ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న ప్రారంభించారు. ప్రతిఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న ఆలోచనతో వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు.

శవపేటిక ప్రారంభం

స్థానిక నాయకుడు తిక్కవరపు సుధాకర్‌రెడ్డి, సతీమణి, సర్పంచ్ వసుంధర తమ సొంత నిధులు రూ.లక్షతో శవపేటికను పంచాయతీకి అందజేశారు. దీనిని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, దేవిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఉడతా వెంకట శేషయ్య ,సీఐ కే రామకృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ హజరత్, వివిధ శాఖల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మనుబోలు బీసీకాలనీలో దొంగల హల్‌చల్



దొంగలు చిందరవందరగా పడేసిన సూట్‌కేసులోని వస్తువులు

మనుబోలు: స్థానిక బీసీ కాలనీలోని దొంగలు హల్‌చల్ చేశారు. ఎవరూ లేని సమయంలో రెండిళ్ల తలుపులు పగులగొట్టి చోరీకు పాల్పడ్డారు. వివరాలు..బీసీకాలనీకి చెందిన మేకా నాగరాజు, శ్రీపతి జనార్దన్ కుటుంబాలు మూడ్రోజుల క్రితం బంధువు ఊర్లకు వెళ్లారు. మంగళవారం రాత్రి తిరిగి వచ్చి చూడగా ఇళ్ల తలుపులు పగులగొట్టి ఉన్నాయి. దీంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాగరాజు ఇంట్లో రూ.20 వేల నగదు, రెండు సవర్ల బంగారు ఆభరణాలు, జనార్దన్ ఇంట్లో రూ.30 వేల నగదు, చిన్న పిల్లల ఉంగరాలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బుధవారం క్లూస్‌టీం వేలి ముద్రలు సేకరించింది. సీఐ సంగమేశ్వరరావు చోరీలు జరిగిన ఇళ్లను పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న వెంకటేష్ భాస్కరన్

ముత్తుకూరు: క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని ఆదాని కృష్ణపట్నం పోర్టు సెక్యూరిటీ హెడ్ వెంకటేష్ భాస్కరన్ పేర్కొన్నారు. మండలంలోని కృష్ణపట్నం జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడా పోటీలు ఆరోగ్యకరంగా ఉండాలన్నారు. అనంతరం వాలీబాల్, ఖోఖో, చెస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్ పోటీలను తిలకించి క్రీడా సామగ్రిని అందచేశారు. ఆదాని ఫౌండేషన్ హెడ్ రాజేష్‌రంజన్, హెచ్‌ఎం సరళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రూ.1.13 కోట్లతో మొగళ్లూరు రోడ్డు నిర్మాణం



సీసీరోడ్డు నిర్మాణానికి జంగిల్‌క్లియరెన్స్ పనులు చేపడుతున్న దృశ్యం

పొదలకూరు : మండలంలోని మొగళ్లూరు రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. తొలుత జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నారు. ఈ మార్గంలో ఊసపల్లి, వావింటపర్తి, అంకుపల్లి, పులికల్లు, వెంకటాపురం, పర్వతాపురం, మొగళ్లూరు గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. రోడ్డు పూర్తిగా దిబ్బతినడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పట్టుబట్టి మార్కెటింగ్‌శాఖ ద్వారా రూ.1.13 కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో శాశ్వత ప్రాతిపదికన 1.6 కి.మీ మేర సీసీరోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు పీఆర్ ప్రాజెక్ట్ ఏఈ మవేక్‌రెడ్డి తెలిపారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



మాట్లాడుతున్న వైస్‌ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి

పొదలకూరు : బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు నిర్వహించనున్న స్పెషల్ డ్రైవ్‌కు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సహకరించాలని వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వైస్ ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12, 19, 26 తేదీల్లో బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా, తదితర సీజనల్ వ్యాధులు సోకకుండా గ్రామాల్లో పారిశుధ్య పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సర్పంచ్‌లకు సూచించారు. తహసీల్దార్ కే వీరవసంతరావు మాట్లాడుతూ మండలంలో అసైన్మెంట్ రివ్యూ కమిటీ ద్వారా 829 ఎకరాలను భూమి లేని పేదలకు అందజేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. 163 జీఓ ద్వారా 277 ఎకరాల చుక్కల భూములకు విముక్తి కల్పించామని తెలిపారు. మేతపోరంబోకు భూములను సైతం అనాధీనంగా మార్చి 278 ఎకరాలను సాగు చేసుకునే వారికి అందజేయనున్నట్లు వివరించారు. మూడో విడత రీ సర్వేలో 8 గ్రామాలను ఎంపిక చేసి సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. రీసర్వే పూర్తయిన 12 గ్రామాల్లో మ్యుటేషన్లు నిలిపివేశామని, ప్రభుత్వ అనుమతితో ఎల్‌పీఎం నంబర్ల ద్వారా మ్యుటేషన్లు చేపడుతామన్నారు. ఎంపీడీఓ టీ నగేష్‌కుమారి జగనన్న సురక్ష ద్వారా అందుతున్న సేవలను వివరించారు. ఈ సమావేశంలో ఏఓ ఏ వాసు, వైద్యాధికారి ఎం రమేష్, హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్ కృష్ణారెడ్డి,, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, వైస్‌ఎంపీపీ సోమా అరుణ, సర్పంచ్ చిట్టెమ్మ, మండలాధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాంపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్నకు చెబుదాంలో వచ్చే అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష, గ్రామ, వార్డు సచివాలయాల్లో సర్టిఫికెట్ల జారీపై కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణం నుంచి జిల్లా, మండలాధికారులు, మున్సిపల్ కమిషనర్లతో బుధవారం సమీక్షించిన కలెక్టర్ మాట్లాడారు. అర్జీదారుల నుంచి అందే సమస్యలను పూర్తిగా చదివి అర్థం చేసుకొని పరిష్కరించాలని సూచించారు. కొందరు కింది స్థాయి అధికారులు సమస్య పరిష్కారం కాకుండానే పరిష్కారమయ్యాయని చూపుతున్నారని, దీంతో అవి రీ ఓపెన్ అవుతున్నాయని చెప్పారు. జగనన్న సురక్షకు సంబంధించిన సర్వేను త్వరగా పూర్తి చేసి సర్టిఫికెట్లు అందేలా చూడాలని ఆదేశించారు. జేసీ కూర్మనాథ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ సుస్మిత, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ప్రసన్న పర్యటన

కోవూరు: మండలంలోని వేగూరులో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం పర్యటించనున్నట్లు డీఏఏబీ చైర్మన్ డీ నిరంజన్‌బాబురెడ్డి బుధవారం తెలిపారు. వేగూరు సచివాలయంలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని సర్టిఫికెట్లు పంపిణీ చేస్తారని వివరించారు.

బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీ పరిధిలోని ఐదో వార్డులో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు మండల, పట్టణ కన్వీనర్లు టుంగుటూరు మల్లికార్జునరెడ్డి, చెర్లో సతీష్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఉదయం 8 గంటలకు ఐదో వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలతో పాటు ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు వివరించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

డిగ్రీ పరీక్షలకు 732 మంది గైర్హాజరు

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో బుధవారం జరిగిన డిగ్రీ పరీక్షలకు 732 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆర్.ప్రభాకర్ తెలిపారు. ఉదయం నిర్వహించిన ఐదో సెమిస్టర్ పరీక్షకు 6,403 మంది విద్యార్థులకు గానూ 5,700 మంది హాజరయ్యారు. 703 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన రెండో సెమిస్టర్ పరీక్షకు 630 మందికి గానూ 601 మంది హాజరై 29 మంది గైర్హాజరయ్యారు.

జగనన్న సురక్షలో 6,903 సర్టిఫికెట్ల పంపిణీ

పొదలకూరు : మండలంలో బుధవారం వరకు జరిగిన జగనన్న సురక్ష క్యాంపుల్లో 6,903 సర్టిఫికెట్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ నగేష్‌కుమారి తెలిపారు. బిరదవోలు, డేగపూడి, దుగ్గుంట, ఇనుకుర్తి, కనుపర్తి, ఆర్‌వైపాళెం, మొగళ్లూరు, వావింటపర్తి, పొదలకూరు బిట్-1, బిట్-3 సచివాలయాల్లో జగనన్న సురక్ష క్యాంపులను నిర్వహించినట్లు వివరించారు. ఆయా సచివాలయాల పరిధిలో కులం 2,904, ఆదాయం 3,179, కొత్త రేషన్‌కార్డులు 38, చేర్పులు, తొలగింపులు 197, విభజన 17, 1బీ 131, అడంగళ్ 126, ఫ్యామిలీ మెంబర్‌కు 28 సర్టిఫికెట్లు అందజేశామని తెలిపారు. 661 మందికి ఆధార్ సేవలు అందజేశామని వివరించారు.

నేడు జగనన్న సురక్ష శిబిరాలు

పట్టణంలోని బిట్-2, బిట్-4 సచివాలయాల్లో గురువారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నగేష్‌కుమారి తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే శిబిరాల్లో 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. ప్రజల సమస్యలపై వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు.

భూ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి



పొదలకూరు : మండల తహసీల్దార్ కే వీరవసంతరావును ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. బిరదవోలు పంచాయతీలోని పెండింగ్ భూసమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. బిరదవోలులో వైభవంగా నిర్వహించనున్న రేణుక మాతమ్మ జాతరకు హాజరుకావాలని ఆహ్వానించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు చిడదల శ్రీనివాస్‌మాదిగ, మునెయ్యమాదిగ, వెంకటరమణయ్య మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

కుటుంబ సభ్యుడిలా..



ఆస్పత్రిలో మంజులమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్ మల్లి(ఫైల్)

ఈమె పేరు మోచర్ల మంజులమ్మ. 75 ఏళ్ల వృద్ధురాలు. మనుబోలులోని దళితవాడకు చెందిన ఈమెకు కొడుకులు లేరు. నలుగురు కుమార్తెలకు పెళ్లిళ్లు అయిపోవడంతో ప్రస్తుతం ఒంటరిగా ఉంటోంది. ప్రభుత్వం అందజేస్తున్న పింఛనే ఆధారం. ప్రతినెలా ఒకటో తేదీన ఎక్కడున్నా వలంటీర్ మల్లి ఠంఛన్‌గా పింఛన్ తెచ్చిస్తాడని చెబుతోంది మంజులమ్మ. కరోనా సమయంలో అనారోగ్యంతో చాలారోజుల పాటు ఆస్పత్రిలో ఉన్నా అక్కడికి సైతం వచ్చి యోగక్షేమాలు తెలుసుకుని పింఛను అందజేశాడని పేర్కొంది.

కొడుకులా సేవలందిస్తున్నాడు

కుమార్తెలకు పెళ్లిల్లు అయిపోవడంతో ఒంటరిగా ఉంటున్నా. నాకు ఏ అవసరం వచ్చినా ఎవరితోనైనా కబురు చేస్తే వలంటీర్ మల్లి వెంటనే వచ్చి తీరుస్తున్నాడు. కొడుకులు లేని నాకు వలంటీర్ కొడుకు కన్నా ఎక్కువగా సేవలందిస్తున్నాడు.

–మోచర్ల మంజులమ్మ, మనుబోలు దళితవాడ

శభాష్ వలంటీర్



విజయవాడలోని ఆస్పత్రిలో శేషయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుధాకర్(ఫైల్)

ఈయన పేరు దారాల శేషయ్య. తోటపల్లిగూడూరు మండలం చింతోపు గ్రామం. అయనకు గత కొన్నేళ్లగా వృద్ధాప్య పింఛన్ అందుతోంది. 2021 అక్టోబర్ 24న ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి తీవ్రంగా గాయపడడంతో కుటుంబ సభ్యులు విజయవాడలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆ సమయంలో వలంటీర్ సుధాకర్ విజయవాడలోని ఆస్పత్రికి వెళ్లి నవంబర్ పింఛన్‌ను అందజేశాడు.

వలంటీర్ సాయాన్ని ఎన్నటికీ మర్చిపోను

విజయవాడలోని ఆస్పత్రిలో ఖర్చులకు కూడా డబ్బులు లేక ఇబ్బంది పడుతున్న సమయంలో వలంటీర్ ఎండ్లూరి సుధాకర్ దేవుడిలా ఆదుకున్నాడు. చింతోపు నుంచి విజయవాడకు వచ్చి వైద్యశాలలో చికిత్స పొందుతున్న నాకు నవంబర్ నెల పింఛన్ చేతికందజేశాడు. ఆ రోజు వైద్యశాలలో నిస్సహాయస్థితిలో ఉన్న నాకు వలంటీర్ చేసిన సాయాన్ని ఎన్నటికీ మర్చిపోను.

–దారాల శేషయ్య, చింతోపు గ్రామం, తోటపల్లిగూడూరు మండలం

పరీక్షలకు ఇబ్బంది లేకుండా..



పద్మావతి వర్సిటీలో విద్యార్థిని వద్ద బయోమెట్రిక్ సేకరిస్తున్న వలంటీర్ వంశీ(ఫైల్)

ఈ ఫొటోలోని యువకుడి పేరు వెంపులూరు వంశీ. పొదలకూరు మండలం మర్రిపల్లి సచివాలయం పరిధిలో వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. గతేడాది నవంబరులో తిరుపతి పద్మావతి యూనివర్సిటీలో ఎమ్మెస్సీ చదువుతున్న గ్రామానికి చెందిన దివ్యాంగ విద్యార్థిని పరీక్షల కారణంగా ఇంటికి రాలేకపోవడంతో అక్కడికే వెళ్లి పింఛన్ అందజేశాడు. భారీ వర్షాలు కురుస్తున్నా లెక్కచేయకుండా తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేశాడు. పరీక్షలు రాస్తున విద్యార్థినికి నగదు అవసరం అవుతాయని వెళ్లి అందజేశాడు.

కరోనాను సైతం లెక్కచేయకుండా..



ఎమ్మార్వో కాలనీలో భోజనం సిద్ధం చేస్తున్న వలంటీర్లు(ఫైల్)

ఈ ఫొటోలో ఉన్న వారు పొదలకూరు వలంటీర్లు. కరోనా లాక్‌డౌన్‌లో పట్టెడన్నం దొరక్క పట్టణంలోని పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో వలంటీర్లు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దాతల సహకారంతో భోజనం ప్యాకెట్లు తయారు చేసి ఇంటింటికి పంపిణీ చేశారు. పేదల ఆకలి తీర్చారు. దీంతో వలంటీర్ల సేవలను పట్టణ ప్రజలు కొనియాడారు.

ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

కొడవలూరు: యూటీఎఫ్ ఆధ్వర్యంలో యల్లాయపాళెం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను మెయిన్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. యల్లాయపాళెం మెయిన్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఎస్కే గౌస్‌బాషా, ఉపాధ్యాయులు ఎల్‌సీఎల్ నారాయణరావు, సీ ప్రసాద్, టీ గోపాల్, సురేష్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పీ తిరుపాలు, జిల్లా కార్యదర్శి షేక్ ఖాజావలి, యూటీఎఫ్ నాయకులు ఎస్కే ఖాదర్ బాషా, ఎస్కే జమీర్‌అహ్మద్, సీహెచ్ శ్రీహరి, నరహరి, సీఆర్‌పీ ఎం దయాకర్ పాల్గొన్నారు.

డ్రాపౌట్స్‌ను గుర్తించాలి



మనుబోలు: గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఏఎంఓ శాంతకుమారి

మనుబోలు: డ్రాపౌట్స్‌ను గుర్తించి బడికి వెళ్లేలా ప్రోత్సహించాలని ఐటీడీఏ ఏఎంఓ శాంతకుమారి అన్నారు. మండలంలోని పల్లెపాళెం, బీవీపాళెం, పిడూరుపాళెం గిరిజన కాలనీల్లోని పాఠశాలలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. జగనన్న విద్యాకానుక పంపిణీపై ఆరాతీశారు. అనంతరం డ్రాపౌట్స్ పిల్లలను గుర్తించి వారి తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. డ్రాపౌట్స్ పిల్లలను గురుకుల పాఠశాలల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఆమె వెంట వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ సెక్రటరీ వినయ్, హెచ్‌ఎంలు శారద, అనురాధ, రమణయ్య తదితరులున్నారు.

డ్రాపౌట్స్‌పై సర్వే చేయాలి

బడిఈడు పిల్లలు పాఠశాలల్లో ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందని ఎంఈఓ శేషాద్రివాసు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులతో బుధవారం సమావేశం నిర్వహించారు. బడిఈడు పిల్లలపై సర్వే చేయాలన్నారు. బడిఈడు పిల్లలను నూరు శాతం పాఠశాలలకు పంపేలా తల్లితండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఈఓపీఆర్డీ ప్రసాద్, ఏపీఎం వనజాక్షి, ఎంఈఓ-2 రమేష్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమణమ్మ, ఆదినారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అర్చక గ్రీవెన్స్‌లో 15 సమస్యలకు పరిష్కారం



నెల్లూరు(బృందావనం): జిల్లా పరిధిలో అర్చకులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అర్చక గ్రీవెన్స్‌లో పరిష్కరించారని జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాదాచార్యులు, ఉదయగిరి వెంకటశేషాచార్యులు పేర్కొన్నారు. సర్వోదయ కళాశాల ప్రాంగణంలో సమావేశాన్ని దేవదాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. జిల్లాలోని 15 ఆలయాల్లో అర్చకులకు నిబంధనల మేరకు జీతాలను పెంచడంతో పాటు పలు ఆలయాల్లో అర్చకులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించారు. జిల్లా అర్చక సమాఖ్య నేతలు శ్రీనివాసశర్మ, ఫణికుమార్, విజయరాఘవ, మణిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు

దేవదాయ శాఖలో అర్చకులకు ఉద్యోగ విరమణ లేకుండా దేవదాయ చట్టం 30 / 87కు సవరణ చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకోవడంపై జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరాంకుశం ప్రసాదాచార్యులు, ఉదయగిరి వెంకటశేషాచార్యులు,, నేతలు గుడ్లూరు ఫణికుమార్‌శర్మ, విజయరాఘవాచార్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు. సీఎంకు అర్చకులు రుణపడి ఉంటారని చెప్పారు.